క్లుప్తంగా

నేత్రదానంతో మరొకరికి చూపు



సర్టిఫికెట్ అందిస్తున్న ఐకేర్ ప్రతినిధులు

చిల్లకూరు: మృతి చెందిన వారి నుంచి సేకరించిన నేత్రాల ద్వారా మరో నలుగురికి చూపును అందించే వీలుంటుందని సునీతా సేవా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు తెలిపారు. గూడూరు పట్టణంలోని సునీత సేవా సంస్థ ద్వారా శనివారం 16వ నేత్ర సేకరణను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని వాలయానందపురానికి చెందిన కలగట్ల జయమ్మ(88) అనే వృద్ధురాలు మృతి చెందడంతో ఆమె నేత్రాలను నెల్లూరులోని సేకరించామన్నారు. మోడ్రన్ ఐ కేర్ సంస్థ వైద్యుల ద్వారా నేత్రాలు సేకరించామని తెలిపారు. అనంతరం మోడ్రన్ ఐ కేర్ వైద్యులు జయమ్మ కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు.

చేపల వేలంపాట వాయిదా

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు పెద్ద చెరువులో ఈ ఏడాదికి చేపలు పట్టుకోవడానికి శనివారం స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన వేలంపాట వాయిదా వేశారు. ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వేలంపాట కోసం కనీసం ఒక్క డిపాజిట్ కూడా రాలేదు. దీంతో స్థానిక ఈవోపీఆర్డీ విజయలక్ష్మీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి వివాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి సూర్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థికి ప్రశంసలు



అభిషేయ్ కీర్తన్‌పాల్‌ను అభినందిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: మాల్దీవులు, శ్రీలంకలో జరిగిన ఎన్‌సీసీ నేవీ ఓవర్‌సీస్ డిప్లాయ్‌మెంటు క్యాంప్‌లో పాల్గొని వాకాడుకు చేరుకున్న ఇండ్లురి అభిషేయ్ కీర్తన్‌పాల్ అనే ఇంజినీరింగ్ విద్యార్థిని శనివారం వాకాడులో వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ప్రశంసించారు. ఇండియా నుంచి ఏడుగురు విద్యార్థులు సముద్రంపై నిర్వహించిన ఈ నేవీ క్యాంపులో పాల్గొనగా అందులో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థి అభిషేయ్ కీర్తన్‌పాల్‌కి అవకాశం దక్కడం విశేషమని తెలిపారు.

నవోదయ పరీక్షకు 59 మంది హాజరు

కోట: కోట బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం 212 మందికి 59 మంది పరీక్షకు హాజరు కాగా 153 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ జయజయరావు పరిశీలించారు. నవోదయ పరీక్ష కోసం విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినప్పటికీ హాజరు శాతం తగ్గడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

గూడూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నవోదయ ప్రవేశ పరీక్షను శనివారం ఉదయం గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పరీక్షకు విద్యార్థులు హాజరు శాతం తెలుసుకున్నారు. ఆయన వెంట విద్యాశాఖాధికారులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

రాపూరు: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీడీఓ భవాని అన్నారు. రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జెడ్పీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, ఎంపీపీ ప్రసన్న, ఏఓ సోమసుందర్, ఇరిగేషన్ ఏఈ సర్ధార్, వైస్ ఎంపీపీ వెంకటస్వామి, తహసీల్దార్ నరసింహులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

చిట్టమూరు(చిల్లకూరు): ప్రయాణికులతో బయలు దేరిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శనివారం చిట్టమూరు మండలం, అనగొల్లపాళెం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కోట నుంచి సూళ్లూరుపేటకు 40 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఆర్టీసీ బస్సు అనగొల్లపాళెం వద్దకు వచ్చే సరికే టైర్ పంక్చర్ కావడంతో పాటుగా స్టీరింగ్ రాడ్ విరిగి పోయి బ్రేక్ ఫెయిల్ అయ్యింది. దీంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యహరించి పొలాల్లోకి బస్సును దించి వేశాడు.

లారీని ఢీకొన్న మోటార్‌బైక్

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారి కూడలి సమీపంలో శనివారం రాత్రి ఆగి ఉన్న లారీని మోటార్‌సైకిల్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలాఉన్నాయి. పట్టణానికి చెందిన మధుసూదన్ రెడ్డి, సుమన్ అనే ఇద్దరు మోటార్‌సైకిల్‌పై ఓజిలి నుంచి నాయుడుపేటకు వస్తున్నారు. వీరి బైక్ నాయుడుపేట సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు పక్కగా నిలబెట్టి ఉన్న లారీని ఢీకొంది. బైక్ బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.



దిగువచావలి చెరువును ఆక్రమించి ఉన్న చెంబడిపాళెం గ్రామస్తులు



గ్రావెల్, మట్టి తవ్వకాలతో రూపు కోల్పోయిన పాలచ్చూరు రామన్న చెరువు

చెరువుల చౌర్యం

వ్యవసాయ భూములకు పుష్కలంగా సాగునీరు అందించేందుకు ప్రధాన ఆధారం చెరువులు. అయితే ఇవి పలుచోట్ల ఆక్రమణలకు గురికావడంతో పంటలకు సాగునీరు సక్రమంగా అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. చెరువు భూముల ఆక్రమణలపై పలువురు రైతులు ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం పెత్తందారుల ప్రలోభాలకు తలొగ్గి చోద్యం చూస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

–పెళ్లకూరు


- సాగునీరు అందక అన్నదాతల అవస్థలు
- పేదలపై మాత్రమే 'రెవెన్యూ ప్రతాపం'

పెళ్లకూరు మండలంలో మైనర్, మీడియం ఇరిగేషన్ పరిధిలో 77 చెరువులు ఉన్నాయి. చెరువుల కింద మొత్తం 3822 హెక్టార్ల మేర చెరువుల విస్తీర్ణం కలిగి ఉంది. వివిధ గ్రామాల్లోని రైతులు చెరువుల ఆధారంతో ప్రతి ఏటా 4523 హెక్టార్లు వరి, 1538 హెక్టార్లు వేరుశనగ, మరో 723 హెక్టార్లలో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. ప్రస్తుతం చెరువుల విస్తీర్ణంలోని చెరువు భూములను స్థానిక పెత్తందారులు, భూస్వాములు కబ్జా చేసి అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. దీంతో ప్రతిఏటా సాగునీరు చెరువుల్లో నిల్వ చేసుకోలేక ఇక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆక్రమణల వివరాలు

నెలబల్లి చెరువు సర్వే నంబరు 377లో 223.05 హెక్టార్లు విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువు నుండి నెలబల్లి, భీమవరం, అక్కగారిపేట, చింతపూడి తదితర దిగువ ప్రాంత గ్రామాల చెరువులకు సాగునీరు సరఫరా అవుతుంది. అయితే నెలబల్లి చెరువుకు ఎగువ భాగంలో ఉన్న తొట్టంబేడు మండలం పొయ్యి, సింగనమాల, కొణతనేరి గ్రామాలకు చెందిన స్థానికేతరులు సుమారు 180 ఎకరాలకు పైగా ఆక్రమించుకోవడం విశేషం. అయితే టీడీపీకి చెందిన ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త వియ్యంకుడి ఆక్రమణలో ఉండడంతో అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. పుల్లూరు పెద్ద చెరువులో కూడా స్థానికేతరులైన కొణతనేరి గ్రామస్తులు 30ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నారు. తాళ్వాయిపాడు తూర్పు, పడమర చెరువుల్లో 95 శాతానికిపైగా ఆక్రమణల చెరలో ఉంది. నాయుడుపేట పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్నందున ఇక్కడి చెరువు భూములన్నీ కబ్జారాయుళ్ల పాలయ్యాయి. చెంబేడు చెరువులో ఎగువ ప్రాంతాలకు చెందిన పునబాక భూస్వాములు సుమారు 345 ఎకరాలకు పైగా ఆక్రమించుకోవడం విశేషం. పాలచ్చూరు చెరువులో స్థానిక పెత్తందారులు సగానికి పైగా ఆక్రమించుకున్నారు. చిల్లకూరు పెద్ద చెరువు, మన్నేమత్తేరు చెరువు భూములను సుమారు 30 శాతానికి పైగా ఆక్రమణలో ఉంది. ఇక్కడ చెరువు సమస్యను గ్రామస్తులు గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. శిరసనంబేడు, పెన్నేపల్లి, కానూరు, చింతపూడి, రావులపాడు, కలవకూరు, అనకవోలు, పెళ్లకూరు గ్రామాల్లోని చెరువు భూములు సగానికి పైగా ఆక్రమణలకు గురి కావడంతో సాగునీరు అందక రైతులు ప్రతి ఏటా తిప్పలు పడుతున్నారు.

జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలి



నెలబల్లి గ్రామానికి చెందిన చెరువును కొణతనేరి, పొయ్యి గ్రామాలకు చెందిన స్థానికేతర భూస్వాములు దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. ఈ విషయమై అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆక్రమణకు గురైన చెరువు భూములను గుర్తించి వెంటనే ఆక్రమణలు తొలగించేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలి. – పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపీపీ, పెళ్లకూరు

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



చిల్లకూరు గ్రామంలో ఉన్న చెరువు భూములను ఆక్రమించుకోవడంతో దిగువ ప్రాంత రైతులకు, చివరి తడి సాగునీరు సక్రమంగా అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ విషయమై గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– పగడాల హరిబాబురెడ్డి, సర్పంచ్, చిల్లకూరు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పలు గ్రామాల్లో చెరువు భూములు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– ద్వారకనాథ్‌రెడ్డి, తహసీల్దార్ పెళ్లకూరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్వచ్ఛ ఆంధ్ర దివస్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్: ఇంటి ఆవరణతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నుండి పట్టణ వీధుల్లో పరిసరాల పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి అనూష

వెంకటగిరి(సైదాపురం): మొక్కలు విరివిగా నాటడంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి ఓ.అనూష తెలిపారు. వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం పరిసరాలను పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మొక్కల పెంపకంపై పతి ఒక్కరు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న సంజీవయ్య, నాయకులు

నాయుడుపేట టౌన్: వైఎస్సార్ సీపీ నాయకుడు తంబిరెడ్డి బలరామి రెడ్డి(67) మృతికి సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో చెన్నై వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి బలరామిరెడ్డి మరణించారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఉన్న వారి నివాసం వద్దకు సంజీవయ్య వైఎస్సార్ సీపీ నాయకులతో వెళ్లి బలరామిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, జయరామయ్య, టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కలికి మాధవ రెడ్డి, ఓట్టురు కిషోర్‌యాదవ్, పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, మీజూరు బాల, పాలేటి నాగార్జున తదితర నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న ఈఈ సత్యనారాయణరెడ్డి

రాపూరు: రాపూరులో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ భవనాలను ఫిబ్రవరి 15లోపు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి తెలిపారు. భవన నిర్మాణపనులను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీఈ ఏడుకొండలలు, ఏఈ వాసు, కాంట్రాక్టర్ చెన్ను భాస్కర్‌రెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

22న నిమ్మ ఫలసాయం వేలం

వెంకటగిరిరూరల్: మండలంలోని పెట్లూరు సమీపం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నిమ్మ, చీనీ పరిశోధన స్థానంలో ఈనెల 22వ తేదీన నిమ్మ ఫలసాయానికి సంబంధించి వేలం పాటలు నిర్వహించనున్నట్లు నిమ్మ, చీనీ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త పీ.శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. 22-01-2025 నుంచి 31-08-2025 వరకు కాల పరిమితితో బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెండర్లను ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు కార్యాలయ పనిదినాల్లో కేటాయించిన రుసుము చెల్లించి డెండర్లలో పాల్గొన్నాలని ఆయన సూచించారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.3.08లక్షలు



పోలేరమ్మ ఆలయ హుండీలలో నగదు లెక్కింపు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలో నగదును శనివారం దేవదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. హుండీలలో నగదు లెక్కించగా మొత్తం రూ.3,08,365 ఆదాయం వచ్చినట్లు గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు తెలిపారు. దేవదాయ శాఖ ఈఓ రవికృష్ణ మాట్లాడుతూ నగదును అమ్మవారి పేరుతో ఉన్న బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. పోలేరమ్మ ఆలయ పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, ఆకుల కుబేరుమణి, నల్లబోతుల రామారావు, చేవూరి చెంగయ్య, పాపాడి రాజశేఖర్‌రెడ్డి, యుగంధర్, కరింభాయి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకోని పక్షుల పండుగ

- సందర్శకులు, పక్షి ప్రేమికులకు కొరవడిన వసతులు
- టూరిజం సముదాయం వద్ద కుర్చీలకే పరిమితమైన ఫిల్మ్‌షో



సబ్ కలెక్టర్ ప్రసంగం కుర్చీలకే పరిమితం



సాంస్కృతిక కార్యక్రమాల వద్ద కానరాని సందర్శకులు

దొరవారిసత్రం: సూళ్లూరుపేట కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పక్షుల పండుగ(ఫ్లెమింగో ఫెస్టివల్)కు వీక్షకులు తరలి వచ్చారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో పండుగ తొలి రోజు శనివారం అధికారుల ఆర్భాటం, హడావుడి తప్ప సందర్శకులు, పర్యాటకులు, పక్షి ప్రేమికులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు కరువయ్యాయి. పక్షులను చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి పర్యాటకులు పక్షుల కేంద్రానికి ఉదయం 7గంటలకే చేరుకుని పక్షులను వీక్షించేందుకు ఎంతో ఉత్సాహం చూపారు.

పక్షుల పండుగ అంటే..

పక్షుల పండుగ అంటేనే నేలపట్టు పక్షుల కేంద్రంలో స్నేక్ షో, మ్యాజిక్ షో, హాస్య నటులతో ప్రదర్శనలు, విద్యార్థులతో ఆట పాటలు వంటివి పెద్ద ఎత్తున జరిగేవి. గత ప్రభుత్వం 2020లో నిర్వహించిన సమయంలో ఈ ప్రదర్శనలు ఉండడంతో వేల మంది ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా పక్షుల పండుగ నిర్వహించారు. అధికారులు హడావుడి చేశారే తప్ప సందర్శకులు, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టలేదు. వన్యప్రాణి విభాగం అధికారులు అడ్డుకోవడంతో స్నేక్, మ్యాజిక్ షోలు పక్షుల కేంద్రంలో ఏర్పాటు చేయలేకపోయినట్లు సబ్ కలెక్టర్ తెలియజేశారు. నేలపట్టు టూరిజం సముదాయం వద్ద విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలు తొలి రోజు మధ్యాహ్నం 2 గంటలకు మొదలు పెట్టే సరికి అక్కడ ఎవరూ లేకుండాపోయారు. పక్షుల పండుగ ప్రత్యేక అధికారి, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, స్థానిక ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. కుర్చీల్లో పట్టు మని పది మంది లేకపోవడంతో నామమాత్రంగా ప్రసంగించి వెళ్లిపోయారు.

అవకాశం ఉండి కల్పించలేకపోయారు

- పక్షుల కేంద్రంలోని చెరువు కట్టపై వ్యూ పాయింట్ల వద్ద బైనాక్యులర్స్ కల్పించలేదు
- పర్యావరణ కేంద్రం వద్ద తాగు నీటి సదుపాయం లేదు
- సచివాలయం ఉద్యోగుకు అందని భోజనం
- చెరువు కట్టపై ఉన్న వాచ్ టవర్ నిరుపయోగమైంది
- వన్యప్రాణి విభాగం సిబ్బంది అరకొర ఏర్పాట్లతో పర్యాటకులకు తప్పని కష్టాలు

ఏకాగ్రతతో బస్సులు నడపాలి



మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు విధుల్లో ఉన్న సమయంలో ఏకాగ్రతగా బస్సులను నడిపి ప్రయాణికులను గమ్యం చేర్చేందుకు భాగస్వామ్యులు కావాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలకు జరగకుండా డ్రైవర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ డీఎం రామకృష్ణ మాట్లాడుతూ ఇంటి నుండి వీధులకు హాజరయ్యే ఆర్టీసీ సిబ్బందిని కుటుంబ సభ్యులు ఒత్తిళ్లకు తీసుకురావొద్దని సూచించారు. ఆర్టీసీలో సురక్షిత ప్రయాణాలు జరుగుతాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శివాజీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ప్రభాకర్, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు బోటు షికారుకి 3 వేల మంది






బీవీపాళెం పడవల రేవులో పడవ షికారు, వేదికపై నృత్య ప్రదర్శన

తడ: ఫ్లెమింగో ఫెస్టివల్ బీవీపాళెం పడవల రేవులో శనివారం పేలవంగా ప్రారంభం అయినా ఔత్సాహికులైన పర్యాటకులు మాత్రం 3 వేల మంది వరకు బోటు షికారు చేసినట్టు అంచనా. సాంస్కృతిక కార్యక్రమాలను వేదికపై ప్రదర్శించేందుకు ఉదయం 9 గంటలకే పడవల రేవుకు చేరుకున్న చిన్నారుకులకు నీళ్ల, స్నాక్స్ అందించే వారు లేకపోయారు. సూళ్లూరుపేట నుంచి బీవీపాళెంకి బస్సులు తక్కువ సంఖ్యలో ఏర్పాటు చెయ్యడంతో చాలామంది ప్రైవేటు వాహనాల్లో తరలి వచ్చారు. తగినన్ని లైఫ్ జాకెట్లు అందుబాటులో లేకపోవడంతో బోట్లు ఉన్నా ఎక్కలేని పరిస్థితి నెలకొంది. అపాచి పరిశ్రమ ద్వారా వచ్చిన వారికి ఆహారం, నీళ్ల ఉచితంగా అందజేశారు. తడ, సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతాల పిల్లలు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చంద్రబాబు నోరు తెరిస్తే అబద్ధాలే..



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: సీఎం చంద్రబాబు నోరు తెరిస్తే అన్ని అబద్ధాలే మాట్లాడతాడని, అది ఆయనకు పుట్టుకతో వచ్చిన స్వభావమని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. రామ్‌కుమార్‌రెడ్డి శనివారం వాకాడులో మీడియాతో మాట్లాడారు. వివిధ రకాల పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు మరో సారి తన అబద్ధాలతో ప్రజలను మోసం చేశారన్నారు. వైకుంఠ ఏకాదశి వేడుకల్లో ఆరుగురు చనిపోయారన్నారు. దీనికి కారణం బాధ్యతా రహిత పాలనేనన్నారు. 2027లో జమిలి ఎన్నికలు కచ్చితంగా వస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కొడవలూరు దామోదర్‌రెడ్డి, పలగాటి సంపత్ కుమార్, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, రాజారెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, గూడూరు సుధాకర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, మధురెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపానికి వేంచేపు చేసి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామి,అమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా నిర్వహించారు.

కండలేరులో 55.776 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 55.776 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 950, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

విజేతలకు బహుమతి ప్రదానం



విజయం సాధించిన ఊటుకూరు జట్టు

సైదాపురం: మండలంలోని ఊటుకూరు గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ జట్లు పోటీలో పాల్గొన్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఊటుకూరు, తురిమెర్ల జట్ల మధ్య హోరాహోరీ పోరు కొనసాగింది. చివరకు ఊటుకూరు జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు నగదును అందజేశారు.